

# పనిలేని మంగలి

దోమలబాధ పడని మానవుడంటూ వుండడు. అవి మానవుణ్ణి కుడతై; మానవరక్తాన్ని పీల్చుకుంటై అని మనకు తెలుసు. అవి మానవరక్తాన్ని త్రాగుతై అనికూడా మనకు తెలుసు. అయితే మానవరక్తాన్ని త్రాగవలసిన అవుసరం వాటికి ఏమొచ్చింది? అనే విషయం మాత్రం మనకు తెలియదు.

వాటికి మానవరక్తం ఆహారం అని మాత్రం వూరికినే అంటాం. వాటికి ఇతర ఆహారం కూడా వుంది. అయినప్పుడు మానవరక్తాన్ని అపేక్షించవలసిన అవుసరం వాటికి ఏమొచ్చింది? తమ ప్రాణాలను పోగొట్టుకోడానికి సైతం సిద్ధపడి మానవ రక్తాన్ని అవి అపేక్షించటం దేనికి? ఈ విషయం మనకు తెలియదు. మానవరక్తం వాటికి రుచికరంగా వుంటుందనే మాట ఊహించి అనే మాటే తప్ప ఆధారం వుండి మాట్లాడే మాట కాదు.

ఈ విషయాన్ని గురించి ఇటీవల కొంతమంది శాస్త్రవేత్తలు కొన్ని పరిశోధనలు జరిపారు. వారు కొన్ని విచిత్రమైన సంగతులు కనిపెట్టారు.

మానవులను కుట్టే దోమలు ఆడవి. మగ దోమలు ఈ పనికి పూనుకోవు. వాటికి కుట్టే సాధనమేలేదు. అయితే ప్రత్యేకం ఆడదోమలే ఈ పనికి పూనుకోవటం దేనికి? ఉబుసు పోకకా? నిద్రపోతున్న మానవుణ్ణి చూచి అసూయ పడుటచేనా? మిగిలిన ఆహారంకంటే మానవరక్తం నిజంగా రుచిగా ఉండుటచేనా? ఇవేమీ కాదంటున్నారు శాస్త్రవేత్తలు. మరేమిటి?

మానవరక్తం త్రాగడం వాటి బ్రతుకుతెరువుకి తప్పనిసరి అని వారు అభిప్రాయ పడుతున్నారు. మానవ రక్తం వాటికి ప్రాణం నిలబెట్టుకోటానికి అవుసరమైన విటమిన్‌గా పనిచేస్తుందట. అవి అప్పుడప్పుడూ మానవరక్తాన్ని రుచి చూడకపోతే, అది కొద్ది తరాల్లోనే నామరూపాలు లేకుండా పోతవట. అయితే తమ బ్రతుకుకు అవి ప్రతినిత్యం మానవ రక్తం రుచి చూడ

వలసిన అవుసరంలేదు. ఇరవై అయిదు తరాల్లో కనీసం వొక్కసారైనా అవి మానవుని రక్తం తాగాలి. అలా తాగ నప్పుడు వాటి సంతతి బలహీనపడి పోయి నశిస్తుంది.

వాటికి రక్తంయొక్క ప్రయోజనం ఇంత వుండబట్టే, వాటికి రక్తాని పీల్చే సాధనం ఇచ్చాడు భగవంతుడు. ఈ సాధనం సహాయంతో అది మానవుని శరీరానికి బెజ్జంపెట్టి రక్తాన్ని త్రాగుతుంది. భగవంతుడు ఇవేకాక దానికి మరికొన్ని వసతులుకూడా కల్పించాడు. అది కుట్టినప్పుడల్లా మానవునికి తెలియకుండా వుండ గలందులకు దాని నోటి వెంట వొక ద్రవం కారుతూ వుంటుంది. ఈ ద్రవం శరీరాన్ని మొద్దు బారేటట్టు చేస్తుంది అంటే ఇటీవల డాక్టర్లు శరీరంలోని ఏ భాగాన్నయినా కుట్టేటప్పుడూ, ఆపరేషన్ చేసేటప్పుడు, తరుచు ఇంజక్షన్స్ ఇచ్చేటప్పుడూ రోగికి అట్టే నొప్పి కలుగకుండా వుండగలందులకు ఆయా ప్రదేశాలకు పూసే మందుకు వుండేశక్తి ఈ ద్రవానికి వుంటుందన్న మాట. అందువల్ల మానవుడు దోమలు కుట్టినప్పుడు నిజంగా పడవలసినంత బాధ పడడు.

అంతేకాదు ఈ దోమలను చంపటం కూడా మానవునికి అసాధ్యమయిన పనే అవుతూ వుంటుంది. అప్పుడప్పుడూ, దోమ కుట్టగానే దానిని చంపటానికి మనం వెంటనే అదికుట్టినచోటు చేతితో చరుచుకుంటాం. ఎంత వేగంగా చరుచుకున్నా కుట్టినదోమ దొరకకుండా పోనే పోతుంది, ఇది ఎలా జరుగుతుందో మనకు బోధపడదు. ఆశ్చర్యాంబుధిలో మునిగి కూర్చుంటాం. అంతలో అది రానే వస్తుంది. తిరిగి కుట్టనే కుడుతుంది. మనకు మిగిలేది దానికాటుతో పాటు చేతి చరుపు.

మానవుని చేతి చరుపునుంచి, అతనిని కుట్టిన దోమ ఏ విధంగా తప్పించుకుంటుందో గ్రహించటానికి కూడా శాస్త్రకారులు కొన్ని పరిశోధనలుచేశారు. మనకు కోపం వచ్చిందనీ, దాని పని పట్టబోతున్నా మనీ, కుట్టిన దోమకు ముందే తెలుస్తుందట. వెంటనే అది ఎగిరిపోతుందట. ఇది ఎలా సంభవం అంటారా ? శాస్త్రవేత్తల పరిశోధనా ఫలితాలను తెలియజేస్తాను— విందురు గాని.

మనం దోమను చరచటానికి చేసే ప్రయత్నంలో మన శరీరం బిగుస్తుంది. ఆ బిగువు, పడబోయే దెబ్బను గురించిన తంతివార్తగా దోమకుఅందుతుంది. అది వెంటనే రానున్న అపాయాన్ని గుర్తించి ఎగిరి పోతుంది. మన చేతి చరుపు మన మీదే పడుతుంది. మనకు కోపం వచ్చినప్పుడు. శరీరం బిగుసుకున్నప్పుడు

సంభవించే కదలిక, దానికి వొక పెద్ద భూకంపంగా అగుపిస్తుంది. వెంటనే అది ప్రమాదాన్ని పసికట్టి తన దారి తను చూసుకుంటుంది.

ఈ గ్రహణశక్తి కూడా దానికి దేవుడు ఇచ్చిన వరమే.

దోమలను గురించి మరొక విషయం కూడా మనం తెలుసుకోవాలి. ఇది మనకు అనుభవంలో వున్న విషయమే. అనుభవంవల్ల దోమలకూ ఇష్టానిష్టాలు అనేవి వుంటవనీ, వాటికి కొందరు వ్యక్తులపట్ల ఎక్కువ అనురాగం వుంటుందనీ మనం అనుకోవలసి ఉంటుంది. దోమల బాధతో మనకు నిద్రపట్టదు. చరచుకునేవాళ్ళం చరచుకున్నట్టే వుంటాం. కాని మనప్రక్కన పడుకున్న పెద్దమనిషి మాత్రం గుర్రుపెట్టి నిద్రపోతుంటాడు.'అతనిది బండనిద్ర' 'అతను వొట్టిమొద్దు' అని మన పరిస్థితిని మనం సరిపుచ్చుకోవచ్చు. కాని ఇందుకు శాస్త్రకారుల మద్దతు మనకు లభించదు. వారు ఈ విచిత్రానికి వేరే కారణం వొకటి వున్నదంటున్నారు. అదేమిటోకూడా చెపుతాను, దాచుకోవటం దేనికి ?

దోమలకు మనమీద ఇష్టానిష్టాలు కుదురుకోటానికి మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కారణం అని శాస్త్రకారులు తమ పరిశోధనల ఫలితంగా చెపుతున్నారు. మన ఉచ్ఛ్వాస నిశ్వాసాల ఉరవడి వాటిని ఆకర్షించేదిగానూ, దూరంగా పారద్రోలేదిగానూ ఉండవచ్చుట. అదీ కాకుండా మనం విడిచే బొగ్గుపులుసు గాలి వొకరకం దోమలను దగ్గరకు తీస్తుందట, మరొకరకం దోమలను దూరంగా తరిమి వేస్తుందట. ఈ కారణాలవల్ల దోమకు కొంతమందిపట్ల అనురాగమూ మరికొందరిపట్ల ఏహ్యభావమూ కలుగుతూ వుండవచ్చుని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. అందువల్ల మనం దోమ కాటుతో బాధ పడుతుంటే మనప్రక్కన పడుకున్న పెద్దమనిషి గుర్రుపెట్టి నిద్రపోయే అవకాశం కలుగుతూ వుంది.

వీటి చేష్టలకు కోపంవచ్చి ఏదోవొక ఉపాయంతో ఈ దోమలను వొక్కుమ్మడిగా చంపుదామా అంటే అదికూడా అంతమంచిపని కాదని చెపుతున్నారు శాస్త్రవేత్తలు. వీటినే ఆహారంగా తీసుకొని రకరకాల పురుగులూ, పక్షులూ, జంతువులూ చేపలూ జీవిస్తున్నాయట! వీటిని చంపితే వాటికి ఆహారం లేకుండాపోతుందట! అవికూడా కృశించి మరణించే ప్రమాదం వుందట! అందువల్ల దోమకంటే మనలను అనేకరెట్లు బాధించే తెగుళ్ళ వృద్ధి చెందే అవకాశం వుందట. ప్రకృతి వైచిత్ర్యం అంటే ఇదే—"మనం దోమలను సహించలేం, చంపలేం." ★